విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 29, నవంబర్ 2023

పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితా

- ఎన్నికల కమిషన్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి - జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.(వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్, వైద్య సేవలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్) ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమితో కలిసి ఎలక్షన్‌రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల ఏడాది కావడంతో అధికారులు మరింత శ్రద్ధ వహించా లన్నారు. ఎవరూ కూడా చిన్నతప్పుకు ఆస్కారం ఇవ్వకుండా చూసుకోవా లన్నారు. పని ఒత్తిడి, త్వరగా అన్ని పనులు పూర్తి చేద్దామని ఉంటుందని, ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమీషన్ ప్రక్రియ, నిబంధనలు అమలు చేయాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదు చేసేందుకు సాధారణ పద్ధతిని అనుసరిస్తున్నారని, జాగ్రత్తగా పనిచేయాలని కోరారు. మిగిలిపోయిన ప్రతి ఓటర్ల జాబితా పరిశీలించి ఇందులో తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: కురుబలు రాజకీయంగా ఆర్థికంగా బలపడాలంటే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించుకున్నప్పుడే రాజకీయంగా ఆర్థికంగా బలపడి కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని కురుబ సంఘ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో కురుబ సోదరులు ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్త కనకదాసు చిత్రపటాన్ని ట్రాక్టర్ లో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డబ్బు వాయిద్యాలతో పూల వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. కురుబ సోదరులు ఐక్యమత్యంతో ఉంటూ రాజకీయంగా ఎదగాలని మండల కురుబ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుబ సోదరులు గంగాధర, వన్నప్ప, సిద్ధారెడ్డి, ఎర్రి స్వామి, గురురాజ్, రవి పాల్గొన్నారు.

శింగనమల పంప్ స్టోరేజీ ప్రాజెక్ట్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర-శింగనమల: మండలంలోని నాయనవారిపల్లి గ్రామం వద్ద క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజీ డెవలప్‌మెంట్ సింగనమల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ కోసం అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పివి. కిషోర్‌రెడ్డి, ఏపిపిసిబి ఏఈఈ కృష్ణా రెడ్డి, పోలీసుశాఖ, ప్రజా ప్రతినిధులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు తాడిపత్రిలో జగనన్నకు చెబుదాం

సద్వినియోగం చేసుకోవాలి...కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : నవంబర్ 29వ తేదీన తాడిపత్రిలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతివారంలో బుధవారం, శుక్రవారం తాడిపత్రి పట్టణంలోని నంద్యాల రోడ్‌లో ఉన్న ఎస్ఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 09:30 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. తాడిపత్రి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముఖ హాజరు తప్పని సరి : డి.ఎం.హెచ్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: వైద్య సిబ్బందికి ముఖ హాజరు తప్పనిసరి అని, లేకుంటే జీలాల్లో కోత ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఈ.బి. దేవి హెచ్చరించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి వైద్యంకు సంబంధించి గుర్తించిన పేషెంట్లకు కాటరాక్ట్ ఆపరేషన్ల చికిత్సలను వెంటనే చేయించాలని ఆదేశించించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను ప్రచారం చేయాలన్నారు.

సంక్షేమ పథకాలతో విప్లవాత్మక మార్పులు

విశాలాంధ్ర-రాప్తాడు: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగన్నరేళ్ళలో సంక్షేమ పథకాల అమలుతో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జెడ్పీటీసీ పసుపుల హేమావతి అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వైసీపీ జెండాను ఎగురవేసి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గత టీడీపీ హయాంలో ఆమలుకాని హామీలిచ్చి చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడ్డారన్నారు. మరోసారి సీఎంగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఎన్నికల ఇంచార్జి చిట్రెడ్డి సత్తిరెడ్డి, కన్వీనర్ జూటూరు శేఖర్, సర్పంచ్ చంద్రకళ చిన్నకృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాముడు, పంచాయతీ కార్యదర్శులు రేఖాశారద, విజయ్, మాజీ సర్పంచ్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ లక్ష్యంగా ఓట్ల తొలగింపు....

- కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి
-ఇప్పటికే వైసీపీ నేతలు భారీగా దొంగ ఓట్లు ఎక్కించారు
- మాజీ మంత్రి సునీత

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవాలంటే కార్యకర్తలు దొంగ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి పరిటాల సునీత సూచించారు. అనంతపురం రూరల్ పరిధిలోని మూడు క్లస్టర్ల పరిధిలో ఉన్న బిఎల్ఎలు, క్లస్టర్ ఇంచార్జిలతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. పరిటాల సునీత మాట్లాడుతూ మనం ఓట్ల విషయంలో చేసింది ఒక ఎత్తైతే ఈ పది రోజుల్లో చేయాల్సింది మరీ కీలకమన్నారు. వైసీపీ నాయకులు ఇప్పటికే చాలా వరకు బోగస్ ఓటర్లను ఎక్కించారని, అలాగే టీడీపీ సానుభూతి పరుల ఓట్లు తొలగించారన్నారు. ఇప్పుడు ఇంకా బోగస్ ఓట్లు ఎక్కించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ప్రతిరోజు ప్రభుత్వ బిఎల్ఓలను కలిసి తమ లాగిన్‌లోకి వచ్చిన ప్రతి ఓటరును పరిశీలించి దొంగ ఓట్లు ఉంటే మాకు సమాచారం అందించాలన్నారు. ఇంక ఎక్కువ సమయం లేదని.. ఇంక పది రోజులు మాత్రమే సమయం ఉందని.. ప్రతి ఒక్క బిఎల్ఏ ఫీల్డ్ కు వెళ్లి డోర్ టూ డోర్ పరిశీలించాలన్నారు. అలాగే ఇంకా గ్రామాల్లో 18ఏళ్లు నిండి ఓటు హక్కు లేని వారిని గుర్తించి.. వారికి ఓటు హక్కు వచ్చేలా చేద్దామన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఇంకా విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లాలని, ఈ కార్యక్రమ నిర్వహణలో రాప్తాడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ మ్యానిఫెస్టోలో పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందన్నది ప్రజలకు తెలియ జేస్తే.. మన గెలుపు పెద్ద కష్టమేమీ కాదన్నారు.

ఢిల్లీ వెళ్లి ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు..

అర్బన్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : టిడిపినే లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు ప్రక్రియ, చేపడుతున్నారని అనంతపురం మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆరోపించారు. మంగళవారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాల యంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విశ్వాసం కోల్పోయిందని, తిరిగి అధికారంలోకి రావడానికి కుట్రలు కుతంత్రాలకు తెరలు లేపారని, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం, అనగదొక్కడం లాంటి చర్యలకు పాల్పడుతూ తెలుగుదేశం పార్టీ అనుచరుల, కార్యకర్తలను ఓట్ల తొలగింపు చేపట్టారని, అలాగే యథేచ్ఛగా దొంగ ఓట్లు చేర్పిస్తున్నారని, ఓట్లు జంబ్లింగ్ చేస్తూ ఇంటిలో సభ్యులవి ఒక బూతులో కుటుంబ పెద్దవి మరో బూతులో చేరుస్తున్నారని ఆరోపించారు. నగరంలో ఫామ్ 8 ద్వారా ఎమ్మెల్యే అనంత ప్రోద్బలంతో ప్రతి బూతులోనూ 20 నుంచి 30 ఓట్ల తొలగింపుకు శ్రీకారం చుట్టారని, ఆధారాలతో సహా వివరించారు. ఎమ్మెల్యే అనంత ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని ఏకపక్షంగా ఓట్ల తొలగింపుకు శ్రీకారం చుట్టడం నగరంలో నీ ప్రోత్సలంతోనే జరుగుతోందన్నారు. ఎలక్షన్ కమిషన్ ను,ఎస్పీ ని కలిసి ఫామ్ 8 ద్వారా ఓట్ల తొలగింపు పై ఫిర్యాదు చేస్తామన్నారు. యదేచ్ఛగా దొంగ ఓట్లు చేర్చే ప్రక్రియ కూడా ప్రారంభమైందని 147 బూతులో 52 ఓట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఒక్కో బూతులో 100 నుండి 200 ఓట్లు చేర్చడం లేదా తొలగించడం చేస్తున్నారని, ఎమ్మెల్యే ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని హితవు పలికారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు తమ ఓటును చెక్ చేసుకోవాలని, మంచి వ్యక్తులను ఎన్నుకోవడానికి ఓటే వజ్రాయుధం అన్నారు.

పరీక్ష ఫీజులు రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాశ్

విశాలాంధ్ర-శింగనమల: రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటిస్తే విద్యార్థులకు అన్ని పరీక్షలు ఫీజులు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్ మీడియా సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, జిల్లాలోని కరువు మండలాల్లో విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను తక్షణమే రద్దుచేసే విధంగా ప్రత్యేకమైన జీవోను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువుతో రైతులు, విద్యార్థులు అల్లాడి పోతున్నారని, పరీక్ష ఫీజులు కూడా కట్టలేని తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యం కింద విద్యార్థులందరికీ పదో తరగతి నుంచి పీజీ విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని కోరారు. ఐక్యతతో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

డిసెంబర్ 15లోగా ఇంటి నిర్మాణాలు ప్రారంభం కావాలి

లబ్ధిదారుల అవగాహన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, వై.విశ్వేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ : సొంతింటి కల నేరవేర్చాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదలకు లక్షలు విలువ చేసే ఇంటిస్థలం అందించి పక్కా ఇండ్లు కుడా మంజురు చేశారని, డిసెంబర్ 15లోపు ప్రతి లబ్దిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని మాజీ ఎమ్మెల్యే, వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో ఉరవకొండ పట్టణంలోని జగనన్న లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించని, మధ్యలో నిలిపివేసిన లబ్దిదారులకు అవగాహన కల్పించడానికి లబ్దిదారుల సమస్యలు తెలుసుకొనేందుకు ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్చార్జ్ ఎంపీడీఓ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఉరవకొండ పట్టణంలో 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజురు చేసిందన్నారు. ఇందులో 1747 ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో, 1740 మంది సొంత స్థలాల్లో - ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈమొత్తంలో ఇప్పటి వరుకు 394 మంది లబ్దిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. 454 మంది కేవలం బేస్ మట్టంకట్టుకొని ఆగిపోయారన్నారు. జిల్లాలోనే అత్యధికంగా ప్రభుత్వం ద్వారా ఇండ్లు మంజురు చేయించా మన్నారు. జగనన్న లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. బిల్లుల మంజురులో జాప్యం లేకుండా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఇంటి నిర్మాణానికి సంఘాల ద్వారా మహిళలకు రూ.35వేలు సున్న వడ్డీతో రుణాలు, ఉపాధి హామీ కింద జాబ్ కార్డు కల్గిన మహిళలకు రూ25వేలు అదనంగా అందిస్తారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి కుష్బుకొఠారి, ఎంపీపీ నరసింహులు, జడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైఎస్ ఎంపీపీ శ్రీనాథ్ రెడ్డి, కమ్మ, కురుబ, ఎంటీసీ కార్పోరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్ పాల్గొన్నారు.

సరిహద్దులో తగ్గిన నీటి ప్రవాహం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుండి వచ్చే ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు సాగు, తాగునీరు సరిహద్దులోని 105వ కిలోమటర్ వద్ద నీటి ప్రవాహం తగ్గిపోయింది. మంగళవారం నాటికి 200 క్యూసెక్కులకు పడిపోయింది. ఆంధ్రా వాటా కింద 16.097 టీఎంటీల నీరు రాగా 20వ తేదీ నాటికి నీటి వాటా ముగిసిపోవడంతో అదనంగా మరో 1 టీఎంసీ నీరు వచ్చాయి. దీంతో మంగళవారం ఉదయానికి సరిహద్దులో 105వ కిలోమీటర్ వద్ద ప్రవాహం తగ్గింది. హెచ్చెల్సీ నీరు తగ్గిపోవడంతో చివరి ఆయకట్టుతో పాటు వెనుకవేసిన పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

టిడిపి నుండి వైసిపిలో చేరిక..

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని మురిడి గ్రామంలో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి,అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో టీడీపి పార్టీ నుండి వైసిపిలోకి భారీగా చేరారు. గ్రామానికి చెందిన టి. ధనుంజయ్య, తిప్పేస్వామీ, ఎం.వెంకటేశులు, చాకలి పరమేష్, ఎం.లక్ష్మణ, జె.హనుమంతప్ప, వారి కుటుంబాలు సిఎం వైయస్ జగన్ రెడ్డి మరియు కాపు రామచంద్రారెడ్డి నాయకత్వంలోని రాష్ట్రంలోను, రాయదుర్గంలోని చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు పనితీరునచ్చి పార్టీలో చేరామని తెలిపారు.

నాలుగు నెలలు కష్టపడితే ఐదేళ్ల రెట్టింపు సంక్షేమం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: రాష్ట్రంలో మరోసారి వైసీపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, సూచించారు. మరో నాలుగు నెలలు కష్టపడితే రానున్న ఐదేళ్లు ప్రజలకు రెట్టింపు సంక్షేమ పథకాలు అందించ వచ్చని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం 35వ డివిజన్‌లోని 51వ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులను. వైసీపీ జెండాను ఆవిష్కరించారు. గతంలో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశా రన్నారు. సీఎం జగన్ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు టీడీపీ నేతలు మినీ మేనిఫెస్టో పేరుతో ప్రకటిస్తున్న పథకాలు అమలు చేస్తే రాష్ట్రం అప్పులపాలవదా? అని ప్రశ్నించారు.. కేవలం సీఎం కుర్చీ కోసమే వాళ్ల పాకులాట అని విమర్శించారు. ఓటరు జాబితా విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తూ ఓటమికి ముందుగానే సాకులు వెతుక్కుంటున్నారని అన్నారు. రాబోయేది వైసీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొండ్రెడ్డి రాధ, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, వైయస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వీరా రామకృష్ణారెడ్డి, పార్టీ క్లస్టర్ కన్వీనర్ మధుసుదన్ గౌడ్, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, ఇషాక్, సచివాలయం కన్వీనర్లు భాస్కర్, అనిల్, జ్యోతి, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖరరెడ్డి, నాగరాజు రెడ్డి పాల్గొన్నారు.

పైప్ లైన్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండలోని పదవ వార్డు రంగయ్య శెట్టి ఇంటి నుంచి వాసవి కళ్యాణ మండపం వరకు నూతనంగా నిర్మిస్తున్న పైప్ లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు కూడా తీసుకుంటున్నామని, ఇప్పటికే దాదాపు రూ.20 లక్షల వ్యయంతో పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, జడ్పిటిసి సభ్యులు పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఈడిగ ప్రసాద్ పాల్గొన్నారు.

మహాత్మా పూలే సేవలు చిరస్మరణీయం

నివాళులర్పించిన కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: మహాత్మా జ్యోతిబా పూలే సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. 133వ వర్ధంతి సందర్భంగా మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణలోని మహాత్మా పూలే విగ్రహానికి కలెక్టర్ ఎం.గౌతమి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ వసీం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, ఏడిసిసి బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్మన్ మంజుల, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ మేడా రామలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, జడ్పి డిప్యూటీ సిఈఓ లలితాబాయి పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో అణగారిన అభ్యున్నతి

విశాలాంధ్ర - బుక్కరాయసముద్రం: మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేశారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు.బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్వో ఆఫీస్ ప్రాంగణంలో ఉన్న పూలే వర్ధంతి పురస్కరించుకొని పూలమాల వేసి, నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే పోరాటాలు, సంస్కరణలు ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగించారన్నారు. బీసీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమించారన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీసీ నాయకులు, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మ పూలే వర్ధంతి

విశాలాంధ్ర- ఆత్మకూరు: సామాజిక అసమానతల మీద అలుపెరగని పోరాటం చేసి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త, సామాజిక ఉద్యమ కారుడు, మహాత్మ జ్యోతిరావు పూలే అని మండల కన్వీనర్ ముట్టాల శ్రీనివాసులు తెలిపారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుళ్లాయప్ప, ఆత్మకూరు మండల క్లస్టర్ ఇంచార్జ్ వెంకటనారాయణ, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రాజా రమేష్, ఆత్మకూరు మండల్ తెలుగు అధ్యక్షుడు అంకె ఆనంద్, ముట్టాల యూనిట్ ఇంచార్జ్ అక్కులప్ప

నేడు వృత్తిదారుల సమాఖ్య సమావేశం

విశాలాంధ్ర-అనంతపురంఅర్బన్ : ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య ఈనెల 29వ తేదీన బుధవారం ఉదయం 10:30కి సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున హాజరవుతారని నాయకులు తెలిపారు. జిల్లా గొర్లు, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఏ.పోతలయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు వెనకచర్ల బాలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి సివి హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణ అందరూ రావాలన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 29, నవంబర్ 2023

ఫోక్సో కేసులో నిందితునికి జైలు శిక్ష ఖరారు

విశాలాంధ్ర-బుక్కపట్నం: ఫోక్సో కేసులో మండల కేంద్రానికి చెందిన బెస్త మహేష్ అనే యువకునికి మూడు సంవత్సరాల జైలు శిక్ష ఖరారైనట్లు ఎస్సై నరసింహుడు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మహేష్ 2021 వ సంవత్సరం మార్చి 6వ తేదీన రాత్రి సుమారు 9 గంటల సమయంలో గ్రామానికి చెందిన మైనర్ బాలిక కిరాణా షాప్‌కు వెళ్లి తినుబండరాలు తీసుకెళ్తుండగా అక్కడే ఉన్న మహేష్ బాలికను చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాలని చూడగా బాలిక గట్టిగా అరుపులు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి అక్కడికి చేరుకోగా నిందితుడు పారిపోయాడు. బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై నరేంద్ర భూపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఫోక్సో చట్టం చట్టం చార్జి సీటు దాఖలు చేయగా ఫోక్సో జడ్జి ఎనిమిది మంది సాక్షులను విచారించి మూడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష రూ.500ల జరిమానా, మైనర్ బాలికకు లక్ష రూపాయల ఫెనాల్టీ విధించిందని ఎస్సై తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభసాటి దిగుబడి

విశాలాంధ్ర-బత్తలపల్లి: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం గంటాపురం గ్రామ పొలంలో రైతులు ప్రకృతి వ్యవసాయం విధానంతో సాగుచేసిన ఉలవ, అనుములు, ఆలసంద, గోరుచిక్కుడు, సజ్జ, కంది, ఆముదం పంటలను వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పరిశీలించారు. వారికి సీఈఓ విజయ్ కుమార్ ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మా నాయక్‌లు ఇక్కడ రైతులు చేస్తున్న విధి విధానాలపై వారికి వివరించారు. భారతి మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం సుదర్శన్ రాజు, ప్రకృతి వ్యవసాయ అధికారులు సుకన్య, నాగేంద్రమ్మ, ముత్యాలప్ప పాల్గొన్నారు.

పారదర్శకతతో ఓటర్ల జాబితా సిద్ధం చేయండి..

- పక్కా రికార్డులు నిర్వహించండి
- ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి
- ఎలాంటి చిన్న తప్పు జరగరాదు
- త్వరితగతిన దరఖాస్తులను పరిశీలన చేసి పరిష్కరిస్తాం..
- కలెక్టర్ పి.అరుణ్ బాబు

విశాలాంధ్ర-పుట్టపర్తి: ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులకు సంబంధించి పక్కా రికార్డులు నిర్వహించాలని ఎలక్టోరల్ అబ్జర్వర్, ఏపియంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓ, ఎఈఆర్ఓలను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబుతోకలిసి ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, స్వీప్ అధికారి శివ రంగ ప్రసాద్ పాల్గొన్నారు

ఈ సందర్భంగా ఎలక్టోరల్ అబ్జర్వర్, ఏపియం ఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పుల సవరణలో సంబంధించి ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పక్కా రికార్డులు నిర్వహించాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తు.చ తప్పక వంద శాతం పాటిస్తూ ప్రొసీజర్ ప్రకారం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొం దించాలన్నారు. ఓటర్ల జాబితాలో కరెక్టే ఉన్నప్పటికీ ప్రొసీజర్ ఫాలో కాకపోవడం వల్ల ఇటీవలే ఇద్దరు అధి కారులను కూడా సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. రోల్ అబ్జర్వర్‌గా తాను రాజకీయ పార్టీల ప్రతినిధుల తోనూ, ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లతో మొదటి సమావేశం నిర్వహిస్తున్నానని వచ్చే సమావేశాలలో క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలిస్తానన్నారు. వచ్చిన క్లెయిమ్స్ అన్నింటినీ పెండింగ్‌లో పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు ప్రొసీజర్ ప్రకారం క్లియర్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తొలగింపులు, నమోదుపై నిర్దిష్టమైన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదులు అందిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తప్పుడు ఫిర్యాదులు అందిస్తే సంబంధిత వ్యక్తులపై కూడా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఆల్ ఇండియా జూడో ఉమెన్స్ ఛాంపియన్షిప్ పోటీలకు ధర్మవరం జూడో విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు కేరళలోని వీఎన్కే స్టేడియంలో జరిగిన సౌత్ ఉమెన్స్ జూడో ఛాంపియన్షిప్ పోటీలలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం జూడో క్లబ్ కొత్తపేట మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి గవ్వల యువ గోల్డ్ మెడల్ తో ఎంపిక కావడం జరిగిందని జూడో క్లబ్ కోచ్ ఎస్. ఇనాయత్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సిఐ. సుబ్రహ్మణ్యం విద్యార్థి అయిన గవ్వల యువను అభినందించి తమ ఆశీస్సులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మేరీ వర కుమారి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు గవ్వల యువను అభినందించారు.

యూటీఎఫ్ కమిటీ ఏకగ్రీవ ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ధర్మవరం పట్టణ శాఖ సర్వసభ్య సమావేశం మంగళవారం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, 7వ వార్డు నందు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి హాజరై, అనంతరం వారు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో నిరంతరం విద్యా రంగ పరిరక్షణకై, ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధనకై పోరాడుతున్న యుటిఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఒక లక్షకు పైగా సభ్యత్వం కలిగి ఉన్న ఏకైక ఉపాధ్యాయ సంఘం అన్నారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులందరూ బలపరచాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ చేపడుతున్న దశల వారీ ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. సమావేశ అనంతరం యుటిఎఫ్ ధర్మవరం పట్టణ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించడం జరిగిందన్నారు. అధ్యక్షులు-జింక హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి - పోసా సాయి గణేష్, గౌరవాధ్యక్షులు- ఆర్.రామకృష్ణ నాయక్, ఉపాధ్యక్షురాలు - కే.నాగేంద్రమ్మ,ఉపాధ్యక్షులు- బి.ఆంజనేయులు, కోశాధికారి -హెచ్. రామాంజినేయులు, జిల్లా కౌన్సిలర్స్ సభ్యులుగా ఏ. లక్షుమయ్య, కేజీవి. నాగిరెడ్డి, ఎం.రాంప్రసాద్, ఎం.మేరీ వర కుమారి, ఆదిశేషు ఎంపిక కాగా, మండల కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ప్రకచారు.

నేడు కౌన్సిల్ సమావేశం..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశాన్ని కౌన్సిల్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు చైర్పర్సన్ కాచర్ల తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అజెండాలోని 13 అంశాలపై కౌన్సిలర్ తో చర్చించి ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అన్ని వార్డులలో పలు సమస్యలపై కూడా చర్చించడం జరుగుతుందని తెలిపారు. పలు టెండర్లను ఆమోదం కోరుట, కొన్ని వార్డుల్లో సిసి రోడ్లు, బీటీ రోడ్లు వేయుట, పే అండ్ యూస్ టాయిలెట్లు నిర్మించుట, పురపాలక సంఘములో అవుట్సోర్సింగ్ సిబ్బందిగా పనిచేయుచు విధి నిర్వహణలో మృతి చెందిన వారికి సాధారణ మరణమునకు రెండు లక్షల ఎక్స్గ్రేషియా, ప్రమాదవశాత్తు మృతి చెందిన ఐదు లక్షలు ఎక్స్గ్రేషియాకు ఆమోదం, ఔట్సోర్సింగ్ పద్ధతిన పోస్ట్ శాంక్షన్‌పై చర్చిస్తామని తెలిపారు. కావున మున్సిపల్ వైస్ చైర్మన్లు, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు సకాలంలో హాజరుకావాలని వారు తెలిపారు.

వ్యాపార సంఘం అభివృద్ధి లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరం: వస్త్ర వ్యాపార సంఘము టెక్స్టైల్స్ రెడీమేడ్ సంఘం అభివృద్ధికి అన్నివేళలా పాటుబడతామని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్లో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ధర్మవరం వస్త్ర వ్యాపార సంఘం టెక్స్టైల్స్ రెడీమేడ్ నూతన కమిటీ అధ్యక్షులుగా కోటి వెంకటేష్, గౌరవ అధ్యక్షులుగా బి.చలపతి, బియం. భాష, ఉపాధ్యక్షులుగా జి. ధనుంజయ ఎన్. రాము, కార్యదర్శిగా డి. మురళి ఎం.ఆ వైస్, కోశాధికారిగా ఆర్. సుధాకర్, ఎల్. శ్రీనాథ్, లీగల్ అడ్వైజర్‌గా న్యాయవాది కేసి. చంద్రమౌళి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

గ్రామ వాలంటీర్లకు శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని రెండు రోజులు పాటు ఉంటుందని ఎంఈఓ-1. రాజేశ్వరి, ఎంఈఓ-2 గోపాల్ నాయక్ తెలిపారు. అనంతరం ఎంఈఓ లు మాట్లాడుతూ మంగళవారం రూరల్ నుండి 70 మంది అర్బన్ నుండి 190 మంది మొత్తం ఒక రోజుకు 260 మంది వంతున"ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమం పై" వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డిసెంబర్ 16 నుండి ఫిబ్రవరి మూడవ తేదీ వరకు ప్రారంభమయ్యే గ్రామస్థాయి క్రీడలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టవంతమైన ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, గ్రామస్తులు అందర్నీ రిజిస్టర్లో చూపించి క్రీడాకారులను ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సౌజన్యకుమారి ఏవో నబి రసూల్ జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి అంజన్న మున్సిపల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుబ్బరాయుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర, ఇతర పీడీలు రఘు, కల్పలత, సరళ, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓటమి భయంతో ఓట్లు తొలగిస్తున్నారు..

ఫలితం అనుభవిస్తారు : పరిటాల శ్రీరామ్



విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓటమి భయంతో ఓట్లను తొలగిస్తున్నారని అక్రమంగా తొలగించిన ప్రతి ఓటుకు కేతిరెడ్డి ఫలితం అనుభవిస్తారని అవసరమైతే ప్రైవేట్ కేసులు కోర్టులకు కూడా వెళ్తామని ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి వారివే కాదు ఓటు వేయాలనుకున్న ప్రతి ఒక్క ఓటు తొలగిస్తున్నారని, మొదట ధర్మవరంలో మీ ఓటు ఉందా? లేదా? చూసుకోండి అని తెలిపారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లు ఇష్టానుసారం తొలగించడం పద్ధతి కాదని వారు హెచ్చరించారు. అంతేకాకుండా ఓట్ల తొలగింపులో ఎంత బరితెగిస్తున్నారో అని కొన్ని ఆధారాలు కూడా వారు విడుదల చేశారు.18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు వేసే హక్కు ఉంటుందని.. కానీ ధర్మవరంలో మాత్రం అసలు ఓటు ఉందో? లేదో? వెతుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. ఇష్టానుసారంగా ఫామ్-7 ఇస్తూ టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలిగిస్తున్నారని శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము నకిలీ ఓట్ల మీద 13వేలు ఉన్నాయని ఫిర్యాదు చేస్తే.. కేతిరెడ్డి ఏకంగా 17వేలు ఉన్నాయని అంటున్నారన్నారు. ఇక్కడ కేవలం టీడీపీ వారివే కాకుండా వైసీపీకి గతంలో ఓట్లు వేసి ఇప్పుడు ఇబ్బంది పడుతున్న వారివి, అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడుతుంటే అటువంటి వారివి కూడా తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలే మీ ఓటు ఉందో? లేదో? సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

జాయింట్ కలెక్టర్, హిందూపురం అసెంబ్లీ నియోజక వర్గం ఎలక్టోరల్ అధికారి చేతన్

విశాలాంధ్ర - హిందూపురం : 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్, హిందూపురం అసెంబ్లీ నియోజక వర్గం ఎలక్టోరల్ అధికారి చేతన్ అన్నారు. మంగళవారం హిందూపురం తాసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫారం-6 దరఖాస్తు చేసుకోవాలని, మరణించిన వారి వివరాలను ఓటర్ జాబితా నుండి డెత్ సర్టిఫికేట్ అప్లోడ్ చేసి మరణించిన వారి ఓటును మరణించిన వారు కుటుంబీకులు తొలగించుకోవాలని, వారికోసం ఫారం-7, తమ ఓటర్ కార్డ్ నందు ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే ఫారం-8 దరఖాస్తు చేసుకునేందుకు ఉన్నదని రాజకీయ నాయకులకు సూచించారు. జనరల్ ఎలక్షన్స్ 2024 దృష్టిలో ఉంచుకొని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కౌంటర్, స్ట్రాంగ్ రూమ్ కోసం ఎంజీఎం స్కూలు, పాలిటెక్నిక్ కాలేజీలను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో హిందూపురం తహసిల్దార్ స్వర్ణలత, హిందూపురం మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, హిందూపురం ఎంపీడీవో నరేంద్రకుమార్, లేపాక్షి తహసిల్దార్ బాబు, చిలమత్తూరు తహసిల్దార్ నాగరాజు, సెరికల్చర్ ఏడి సురేష్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ రెడ్డి శేఖర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనారు.

భవిష్యత్ బాగుండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి

విశాలాంధ్ర-ముదిగుబ్బ: రాష్ట్రంలో ప్రజల భవిష్యత్ బాగుండాలన్నా పాలన మళ్లీ గాడిలో పడాలన్నా మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు పంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్తూ మ్యానిఫెస్టోలోని పథకాల కరపత్రాలను అందజేశారు. ప్రతి ఇంట్లో ఎంత మంది ఉన్నారు.. ఏ పథకానికి అర్హులు, ఎంత లబ్ధి చేకూరుతున్నది వంటి అంశాలను వివరించారు. చాలా మంది గ్రామాల్లో నెలకొన్న సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిన్నింటినీ శ్రీరామ్ పరిశీలించి. టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లు మాటలు చెప్పుకుని,గొప్పలకు పోయి పాలన సాగించారని, కనీసం ఈ నాలుగు నెలలైనా ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టాలన్నారు. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబు దూర దృష్టితో రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా 20 వేల రూపాయలు అందిస్తామని చెప్పారన్నారు. మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని,నెలకు 15వందల రూపాయలు ఆర్థిక సాయం, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పిల్లల చదువులకు రూ.15 వేలు ఆర్థిక సాయం వంటివి ప్రకటించారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రమేష్ బాబు, కర్ణం ప్రభాకర, తుమ్మల మనోహర, అశ్వత్ రెడ్డి, కణం చంద్ర, కృష్ణమూర్తి,గడ్డం మోహన, మల్లెల నారాయణస్వామి, కోట్ల బాబి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

విశాలాంధ్ర-అగళి : మండలంలోని కోడిపల్లి గ్రామ సచివాల యంలో జగన్ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు సంబందించిన బోర్డును మంగళవారం ఎంపీపీ రేణుక కామరాజు, మండల పార్టీ కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్‌లు ఆవిష్కరించారు. కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అభివృద్ధి కోసం జగనే ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రేణుక,మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, ఎంపీపీ రేణుక కామరాజు, మండల ఉపాధ్యక్షులు గాయత్రి హేమంత్ రాజ్, విమల సదా నంద ఆరాధ్య, ఎంపిటిసి సభ్యులు లింగమ్మ బసవరాజు సింగల్ విండో అధ్యక్షులు జయరాముప్ప పాల్గొన్నారు.

ప్రతి రైతన్నకు పగటిపూట తొమ్మిది గంటల క్వాలిటీ విద్యుత్..

విశాలాంధ్ర-ఓడిసీరూరల్: ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 28 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి సి ఎం జగన్ శంకుస్థాపన చేశారు. అందులో భాగంగానే పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓడి చెరువు మండలం తిప్పేపల్లి గ్రామంలో 132/33 కే వివిద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల నిర్మాణం కోసం అనుమతి లభించింది. మంగళవారం మండల కేంద్రంలో వైయస్సార్ సర్కిల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న వ్యవసాయం, గృహ అవసరాలు, పారిశ్రామిక అవసరాలు తీర్చేందుకు 133/33కెవి మంజూరు కావడం ఆనందంగా వుందన్నారు. దీని వల్ల ప్రతిరోజూ 9గంటల నాణ్యమైన విద్యుత్ అంతరాయం లేకుండా అందిచ్చన్నారు. కార్యమానికి ఎంపీపీ తుమ్మల పర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదరరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి తుమ్మల శామీర్ భాష, కన్వీనర్ రాజూ నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్టా రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ లక్ష్మీ రెడ్డి, నాయకులు మలక అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయుడు

విశాలాంధ్ర-పుట్టపర్తి : పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో అక్షర జ్యోతిని వెలిగించిన మహనీయులు సామాజిక వేత్త బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో అసమానతలు లేని సమాజం కోసం సమానత్వం హక్కుల కోసం అహర్నిశలు ఎనలేని కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆయన సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సత్యశోదా అనే సంస్థ ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాలు వారికి విద్యాబుద్ధులు అందించి చైతన్య వంతులను చేయడమే కాకుండా పేదల జీవితాల్లో మార్పు కోసం ముఖ్యంగా మహిళల విద్య కోసం మహిళా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరాములు, డాక్టర్ తిరుపతివేంద్ర, వెంకట్రాముడు, వెంకటస్వామి, వడ్డెర సంఘ నాయకుడు రమణ, తెలుగు యువత మాల మనోహర్, శ్యామ్ సుందర్, శ్రీనివాసులు, బిజెపి టౌన్ కన్వీనర్ సోకే రామాంజనేయులు, మల్లికార్జున, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి - డిఆర్ఓ

విశాలాంధ్ర-పుట్టపర్తి: అట్టడుగు వర్గాల ప్రజలకు పేద రైతన్యానికి గొప్ప దార్శనికుడిగా జ్యోతిరావు పూలే ఎన్నో సేవలు అందించారని ఆయన జీవితం ఒక ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, అట్టడుగు ప్రజల కోసం విద్యా వ్యాప్తి కోసం జ్యోతిరావు పూలే చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అలాంటి మహనీయుని స్మరించుకోవడమే గాక ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం సాధికారిక అధికారి శివరంగ ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాము నాయక్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి విద్యే ఆయుధం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలోని తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి సవిత మాట్లాడుతూ మహాత్మజ్యోతి రావు మహిళలు, అట్టడుగువర్గాల ఆత్మగౌరవ పోరా టానికి విద్యనే ఆయుధంగా అందించిన పూలే మహాశయుడని అన్నారు. జ్యోతి రావు పూలే మాదిరిగా సంఘానికి ఉపయోగపడే విధంగా కృషి చేయాలని కోరారు.

పెనుకొండ ఎమ్మెల్యే నివాళులు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం నందు మంగళవారం స్థానిక శాసనసభ్యులు శంకర్ నారాయణ మరియు కార్యకర్తలతో కలిసి మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సమాజానికి చేసిన సేవలు గురించి కొనియాడారు సామాజిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేశారన్నారు.

తనిఖీల పేరిట వేధింపు తగదు

వాపోయిన ఉపాధి గుత్తే దారులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ఐదు సంవత్సరాల క్రితం ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల బిల్లులు చెల్లించాలని గతంలో న్యాయస్థానం, రాష్ట్ర ఉన్నతాధికారి ఆదేశించిన నేటికీ బిల్లు బకాయిలు చెల్లించక తనిఖీల పేరిట వేధిస్తున్నారని.. మంగళవారం సైతం తనిఖీల పేరిట క్వాలిటీ కంట్రోలర్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పనులు తనిఖీ వస్తున్నట్లు నోటి మాటగా సమాచారం ఇవ్వడం దారుణమని గుత్తేదారులు లింగానాయుడు, దేవేంద్రనాథ్‌రెడ్డి, నారాయణ స్వామి, రామ్మోహన్ వాపోయారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పెద్దచిగిళ్లరేవు, దొరిగిల్లు, ఈదులపల్లి, భూదానం పల్లి, గుంజే పల్లి, మంగళ మడక పంచాయతీల పరిధిలో సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశామని, ప్రభుత్వం మారడంతో వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించక వేధించడంతో తప్పని పరిస్థితిలో న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. పనులు సక్రమంగా జరగలేదని ప్రభుత్వం న్యాయ స్థానం దృష్టికి తేవడంతో పనుల నాణ్యత, పనుల కొలత తదితర వివరాలు పరిశీలించాలని న్యాయ స్థానం తెలపడంతో అధికారులు పరిశీలించి సక్ర మంగా ఉన్నట్లు నివేదికలు ఇచ్చారని, దీనితో న్యాయ స్థానం గుత్తేదారుల బిల్లులు అందజేయాలని ఆదేశించడంతో 80% బిల్లులు మంజూరు చేశారని మిగిలిన 20 శాతం నిధులు పనుల పరిశీలన అనంతరం అందజేస్తామని తెలిపి నేటికీ తనిఖీల పేరిట వేధిస్తోందన్నారు. కార్యక్రమానికి క్వాలిటీ కంట్రోలర్ అధికారి నాగ శేఖర్, ఏఈ జగదీష్, ఏ ఈ లక్ష్మీనారాయణ, ప్రసాద్, మండల ఇంజనీర్ రవీంద్ర, మాజీ మండల ఇంజనీర్ పండరీనాథ్ హాజరయ్యారు.

అత్యధిక ఓట్లు తొలగింపుపై వివరణ ఇవ్వండి..

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు డిష్ రాజు

విశాలాంధ్ర-ధర్మవరం: నియోజకవర్గంలో ఓటర్ లిస్ట్ విచారణలో భాగంగా ఫారం-7 ఆధారంగా అత్యధిక ఓట్లు తొలగింపుకు నోటీసులు పంపించడం జరిగిందని ఈ విషయంపై ఆర్డిఓ రమేష్ రెడ్డిని వివరణ కోరడం జరిగిందని బిజెపి పట్టణ అధ్యక్షుడు డిష్ రాజు, రూరల్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ఫారం-6,7,8 సంబంధించిన వాటిలో ఏ వివరము కనపరచకుండా రెవెన్యూ అధికారులు మార్పులు, చేర్పులు, తొలగింపులు జాబితా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆర్డీవో ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధను కనపరిచి, పూర్తి సమాచారం ఉన్న ఓటరు జాబితాని ఇవ్వాల్సిందిగా తాము కోరడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గత మూడు నెలల నుండి సంబంధించిన ఓటర్లకు నోటీసులో జారీ చేసిన వాటిని కూడా మాకు ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా కుటుంబంలోని డోర్ నెంబర్ కు సంబంధించిన కుటుంబ సభ్యుల జాబితాను ఒకే చోటు సీరియల్ గా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరడం జరిగిందని తెలిపారు.

పట్టణంలోని కాలేజీ సర్కిల్లో గల పూలే జ్యోతిరావు విగ్రహానికి 133వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, వెనుకబడిన కులాల ఎదుగుదలకు ఎంతో కృషి చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోట్లూరు చంద్ర, ప్రధాన కార్యదర్శులు రాప్తాటి రాము, దుస్సా కృష్ణ, సీనియర్ నాయకులు తుంపర్తి పరమేష్, గంధమనేని నారాయణస్వామి, రహీం, బాబా, దస్తగిరి, శ్రీనివాసులు, హరి, సూర్యనారాయణ, అనిల్, రాజు, నంద నాయక్, పోతులయ్య పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే

విశాలాంధ్ర-ధర్మవరం: సామాజిక ఉద్యమకారుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని నాయి బ్రాహ్మణ సోదరులు తెలిపారు. పూలే 133వ వర్ధంతి సందర్భంగా కాలేజీ సర్కిల్ వద్ద గల విగ్రహానికి నాయి బ్రాహ్మణ వాయిద్య కళాకారులు వారి వాయిద్యాలతో సంగీతాన్ని ఆలపించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో రాము, లింగమూర్తి, శివరాం, ఆంజనేయులు, లింగమయ్య, గురుమూర్తి, దామోదర్, మంజునాథ్, చలపతి ,రామకృష్ణ, తిరుపతయ్య, సాయిప్రసాద్ పాల్గొన్నారు. పట్టణంలోని ఎల్సీ సర్కిల్ వద్ద గల శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినీలు జ్యోతిరావు పూలే133 వ వర్ధంతి సందర్భంగా కాలేజీ సర్కిల్ వద్ద గల విగ్రహానికి ప్రిన్సిపాల్ మల్లికార్జున, అధ్యాపక బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 29, నవంబర్ 2023

అర్బన్ లింక్ రోడ్డుపై సలహాలు, సూచనలు స్వీకరణ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం నగరంలోని డ్వామా కార్యాలయంలోని సమావేశం మందిరంలో మంగళవారం అర్బన్ లింక్ రోడ్డుపై మైనారిటీ మత పెద్దలు, ప్రతినిధులతో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, ప్రభుత్వ కార్యదర్శి ఎ.ఎం.డి.ఇంతియాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, ప్రభుత్వ కార్యదర్శి నగరంలో ఏర్పాటు చేసే అర్బన్ లింక్ రోడ్డు, సప్తగిరి సర్కిల్ వద్దనున్న నమాజ్ కట్ట మసీదు (ఈద్గా మసీద్)కు సంబంధించిన భూసేకరణపై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఇందులో కొంతమంది మత పెద్దలు దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ వసీం సలిం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఫయాజ్, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, నేషనల్ హైవే ఈఈ మధుసూదన్, ఆర్ అండ్ బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, జిల్లా వక్ఫ్ కమిటీ ప్రెసిడెంట్ కాగజ్

రిజ్వాన్, ఈద్గా మసీద్ ముతవల్లి షకీల్ షఫీ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హుస్సేన్ సాబ్, వైఎస్ఆర్సిపి జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ షఫీవుల్లా బైగ్, సిపిఐ ప్రతినిధి జాఫర్ సాబ్, జిల్లా టిడిపి ప్రెసిడెంట్ సాలర్ బాషా, బాడుగ షాపుల యజమానులు కుమార్, మెహరాజ్ పాల్గొన్నారు.

గట్టు వెంకటరమణప్ప సేవలు మరువలేనివి

పలువురు నాయకులు ఘన నివాళి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ గాంధీ హరిజన హాస్టల్ ప్రారంభ వ్యవస్థాపకుడు గట్టు వెంకటరమణప్ప చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వెంకటరమణప్ప 125వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం హాస్టల్ కమిటీ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ సిడిపిఓ రామాంజినమ్మ అధ్యక్షత వహించినారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు ఆనంద్ రాజు మీనుగ గోపాలు, కోనాపురం ఎర్రిస్వామి,వన్నూరు స్వామి తదితర వక్తలు మాట్లాడుతూ వెంకటరమణప్ప గత అనేక సంవత్సరాల క్రితమే దళిత బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలని వారంతా సమాజ అభివృద్ధికి పాటుపడాలని ప్రధానంగా దళితులు ఉన్నత స్థానంలో ఉండాలని సాంఘిక సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేశారని ఆయన కృషి ఫలితంగానే ఉరవకొండ ప్రాంతంలో అనేకమంది దళితులు చైతన్య వంతలై ఉన్నత స్థానాల్లోనూ, ఉద్యోగాల్లోనూ కొనసాగుతున్నారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆదర్శాలను పాటిస్తూ ఆయన అడుగుజాడల్లో నడవవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మీనుగ పెద్దన్న, లక్ష్మీనరసమ్మ, కింగూరి ఎర్రిస్వామి, మాదిగ ఎల్లన్న ఓబయ్య, సోమశేఖర్, ఇజ్రాయిల్, లత్తవరం చంద్ర ట్రైలర్ సునీల్, ఆంజనేయులు, తొండ్లం సుభాష్, ఆంజనేయ్య, రంజిత్ వేణు ప్రసాద్, సుంకన్న, తిప్పయ్య, ఎర్రిస్వామి,రమేష్ తట్రకల్ ఇజ్రాయిల్, గుర్రం రామాంజనేయులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాలకు సంక్షేమం

విశాలాంధ్ర-రొళ్ల: ప్రజలకు సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే మరొకసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని జడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెరాట్టేబెట్ట గ్రామ సచివాలయం వద్ద వైకాపా మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, జే.సి.స్ మండల కన్వీనర్ రంగనపల్లి నాగేంద్ర ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కావాలంటే మరోమారు జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. గ్రామంలో వైసీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి ప్రదర్శించారు. నాలుగున్నర ఏళ్ల పాలనలో రూ.12.26 కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా వారి యొక్క ఖాతాలోకి జమ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పని తీరు ఇప్పటి ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది అని ప్రజలను అడిగి తెలుసుకుని వారి అభిప్రాయం మేరకు వివరాలను సేకరించడం జరుగుతుందని, నవరత్నాలు లబ్దిదారులందరికీ అందుతున్నాయని, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ 2024లో కూడా మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కల్లుమడి ఆజాద్, ఈఓఆర్డీ కృష్ణప్ప, సింగల్ విండో అధ్యక్షుడు మోతిరామ్ నాయక్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అలుపనపల్లి శ్రీనివాస్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు యర్ర గుంటప్ప, కాంతరాజు, శివాజీ, ఆనంద్ నాయక్, సచివాల ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విజయవాడ మహాధర్నాలో రైతు కార్మిక సంఘం నాయకులు

విశాలాంధ్ర-ఆత్మకూరు: మోదీ ప్రభుత్వం రైతు,కార్మిక వ్యతిరేకవిధానాలకు నిరసనగా రెండవరోజు విజయవాడ జింఖానా గ్రౌండ్ నందు మహాధర్నాలో అనంతపురం సత్యసాయి జిల్లా రైతుకార్మిక సంఘం నాయకులు తోపాటు రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.మల్లికార్జున, జిల్లారైతుసంఘము ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.సూర్యనారాయ రెడ్డి ,ఎఐటియుసి అధ్యక్షులు రాజేష్ గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రైతు సంఘం ఏఐటీయూసీ జిల్లానాయకులు టీ నారాయణ స్వామి, వన్నారెడ్డి, మురళి, మహదేవ, రాము, నీళ్ల పాల రామకృష్ణ, రమేష్, చిరంజీవి, లలితమ్మ, జోసెఫ్,శ్రీదేవి, సాయి పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డిని.. దీవించండి..

విశాలాంధ్ర-పెనుకొండ: మండలంలోని మావటూరు గ్రామపంచాయతీలో "జగనన్నే ఎందుకు కావాలంటే" అనే కార్యక్రమంలో భాగంగా వైయస్సార్సీపీ జెండా ను ఆవిష్కరించి సచివాలయంలో జగనన్న ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించి జగనన్న పథకాల ఆవశ్యకతను గూర్చి ప్రజలకు వివరించి మరొక్కసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగరాజు ,వైఎస్ఆర్సిపి నాయకులు సుధాకర్ రెడ్డి ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ శివయ్య ,మండల కన్వీనర్ నాగులూర్ బాబు రెడ్డి, వైస్ సర్పంచి నాగభూషణ్ రెడ్డి, మావటూరు వైఎస్ఆర్సిపి నాయకులు మరియు మండల వైఎస్సార్సీపీ నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయ శిఖరానికి విరాళం

విశాలాంధ్ర-లేపాక్షి : దేవుని ఆశీస్సులతో నిరంతరం పురాతన దేవాలయాలు నూతన దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సమాజ సేవకుడు రమామణి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కరణం రమా నందన్ పేర్కొన్నారు. బిసల మానంపల్లి గ్రామస్తుల పిలుపుమేరకు మంగళవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న దేవాలయం సందర్శించి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల అభివృద్ధికి కృషి చేయాలని తెలపగా దేవాలయంలో ప్రధానమైన ఆలయ శిఖరం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం రాజీవ్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న దొండు మరియమ్మ గ్రామస్తుల రావాలని కోరగా అక్కడికి వెళ్లిన రమానందన్ అమ్మవారి ఉత్సవ విగ్రహాల దేవాలయానికి అందజేస్తానన్నారు. గతంలో కూడా సిమెంట్ బస్తాలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆయనను రెండు గ్రామాల ప్రజలు శాలువాలతో సన్మానించారు.

గజగౌరీదేవికి చక్కెర హారతులు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే గజగౌరీ ఉత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గజగౌరీ దేవికి మహిళలు తరలివెళ్లి హారతులు సమర్పించారు. ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, నేమకల్లు, కురువల్లి, సిద్దరాంపురం, గోనేహాళ్, శ్రీధరఘట్ట, శింగానహళ్లి,కృష్ణాపురం, లింగదహాళ్, కొలగానహళ్లి, దేవగిరి క్రాస్ తదితర గ్రామాల్లోని మండపాలలోను, దేవాలయం వద్ద ఆవిష్కరించిన గజగౌరీదేవికి యువతులు, మహిళలు భక్తులు చక్కెర హారతులు నూతన వస్త్రాలు పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు బాణాసంచాలు పేల్చుతూ అమ్మవారికి స్వాగతం పలికారు. చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్దేహాల్‌లో గజగౌరీదేవిని మంగళవారం రాత్రి మాజీ మంత్రి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు, నాయకులు సంగప్ప, నవీన్, దుర్గాప్రసాద్, బాబు, పయ్యావుల అనిల్, మహేంద్ర, నాగరాజు, ధనుంజయ, పయ్యావుల మోహన్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యతోనే విజయాలు సాధ్యం..

ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి..

విశాలాంధ్ర-లేపాక్షి : ప్రస్తుత సమాజంలో గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు విద్యాబుద్ధులు అలవర్చుకొని విజయాలకు బాటలు వేయాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని సిరివరం జిల్లా ఉన్నత పాఠశాలలో సిరివరం, పూలకుంట, నాయనపల్లి, పాఠశాల సిబ్బందికి విద్యార్థులకు 5 లక్షలు విలువ చేసే కంప్యూటర్స్, ప్రింటింగ్ మిషన్స్, టీవీలను హెరిటేజ్ వారి సహకారంతో ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, ఆవుల రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న శివ కృష్ణ సాయి వృద్ధాశ్రమంలో ఉమ్మడి గురు ప్రసాద్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఉమ్మడి గురు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సిద్ధవటం సాయి భాస్కర్‌రెడ్డి సుబ్బలక్ష్మి పెళ్లిరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశామన్నారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శివలింగాలకు కార్తీక పూజలు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో ప్రతిష్టించిన 108 శివలింగాలకు కార్తీక పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, అష్టోత్తర పూజ నిర్వహించి పుష్పలంకరణ చేసి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. దీపోత్సవం నిర్వహించారు. భక్తులు వందలాది మంది శివలింగాలను దర్శించుకున్నారు. విశేష పూజ జరిపించారు.

జన విజ్ఞాన వేదిక కార్యదర్శికి రక్తదాన పురస్కార్ అవార్డు

విశాలాంధ్ర-ఉరవకొండ : జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి అంతర్జాతీయ సేవా భారత్ అవార్డు గ్రహీత వజ్రకరూరు మండల కేంద్రానికి చెందిన మీండ్లపల్లి మల్లికార్జున రక్తదాన పురస్కార్ అవార్డు అందుకున్నారు మంగళవారం గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో రక్తదాతల పురస్కారం కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ భవాని హాజరై మల్లికార్జునకు పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంపీ మల్లికార్జున సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిని అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమందికి రక్తదానం చేశారని కొనియాడారు. మహనీయులు స్వతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తిని నలుగురికి తెలియజేయడం సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ చిన్న వయసులోని మంచి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ మల్లికార్జున జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ యాదవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గంగాధం పాల్గొన్నారు.

అంగన్వాడీలలో నాడు నేడు పనులపై సమీక్ష, శిక్షణ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలోని బాలికల ఉన్నత పాఠశాల నందు మంగళవారం ఐసిడిఎస్, సిడిపిఓ వారి ఆధ్వర్యంలో అంగన్వాడీ నాడు నేడు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టరు లక్ష్మీ కుమారి, జిల్లా విద్యా శాఖ అధికారి మీనాక్షి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు నేడు ఫేజ్2లో మంజూరు అయిన అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తులు నాణ్యత పనులు చేయించాలని,హెడ్ మాస్టర్‌లు ఫీల్డ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, అంగన్వాడీ స్థాయిలో తల్లుల కమిటీలు ఏర్పాటు చేసి మరమ్మత్తుల పనులన్నీ కమిటీ ఆధ్వర్యంలో జరగాలని, తల్లుల కమిటీకి కన్వీనర్‌గా ఐసిడిఎస్ సూపర్వైజర్ వుంటారని, సభ్యులుగా ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి, హెడ్ మాస్టర్, అంగన్వాడీ కార్యకర్త, 2 నుండి 4 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లల తల్లులు వుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సుదాకర్ 2, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాతమ్మ, అనురాధ, పుష్పలత పాల్గొన్నారు.

గంగమ్మ పార్థివ దేహానికి నివాళులు

విశాలాంధ్ర-యాడికి : చింతలయ పల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఓబులరెడ్డి తల్లి గంగమ్మ (80) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి చింతలాయపల్లి గ్రామానికి వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ చావ్వా గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య పాల్గొన్నారు.

కల్లూరులో వై ఏపి నీడ్ జగన్..

విశాలాంధ్ర-లేపాక్షి: మండలం కల్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం వై ఏపి నీడ్ జగన్ కార్యక్రమంను గ్రామ సర్పంచ్ వసుంధర అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పిటిసి సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్ ఎంపిపి నీలావతి, మండల కన్వీనర్ నారాయణస్వామి, అగ్రి బోర్డు చైర్మన్ ప్రభాకర్ పాల్గొని సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్సీపీ జెండాను ఎగురు వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవరత్నాలలో భాగంగా సంక్షేమ పథకాలు మన ప్రభుత్వంలో ఎవరెవరికి లబ్ది చేకూరిందో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు తెలియజేసారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ తిప్పన్న, వైఎస్సార్సీపీ నాయకులు ప్రభాకర్, హనుమంతరాయప్ప, గంగప్ప, కగ్గల్లప్ప, శివశంకరరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

చౌళూరు పంచాయతీలో..

విశాలాంధ్ర - హిందూపురం : చౌళూరు పంచాయతీ సచివాలయం రెండు నందు సర్పంచ్ అంజప్ప, మండల కన్వీనర్ రాము, జెసిఎస్ కన్వీనర్ గిరీష్ ఆధ్వర్యంలో మంగళవారం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చోళూరు మధుమతిరెడ్డి పాల్గొన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలలో భాగంగా సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. చౌళూరు పంచాయతీ సచివాలయం-2 డీబీటీ క్రింద రూ.13,10,99,360లు, నాన్ డీబీటి క్రింద రూ.3,43,23,453లు మొత్తం డిబిటింనాన్ డీబీటీ రూ.16,54,22,813లు ప్రజలకు లబ్ధిచేకూరిందని తెలిపారు. అనంతరం వార్డు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్సిపి జెండాను ఆవిష్కరించి, ఇంటి ఇంటికి తిరిగి 2019 లో చంద్రబాబు ఇచ్చిన హామీలు, 2019లో జగన్ ఇచ్చిన హామీలు, ఏ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు నెరవేర్చారో, 10 ప్రశ్నల పత్రాన్ని వివరిస్తూ పదికీ పది ఎవరికి మార్కులు వచ్చాయో దానికి గాను ఒక రిసిప్ట్ ఇస్తూ దానిపై ఆపు బాబు నాటకం జగనన్నే మా నమ్మకం అనే స్టాంపు వేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుఆర్డివో నటరాజ్, ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ ఆదేప్ప, ఎంపిటీసీ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ బసప్ప, రాజు, నాయకులులోకేష్ రెడ్డి, రామక్రిష్ణ, శంకరప్ప, లింగప్ప, గాంధీ, గంగాధరప్ప, ప్రకాష్, లింగమ్మ తదితర అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఛాంబర్ కార్య నిర్వాహక కార్యదర్శికి ఘన సన్మానం

విశాలాంధ్ర-శింగనమల: రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్య నిర్వాహక కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన దేగల కృష్ణమూర్తికి అనంతపురంలోని ఆయన నివాసంలో తెలుగుదేశం నాయకులు అభిమానులు గజమాల శాలువాలతో ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్ర మంలో నిట్టూరు శివాజీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నరేంద్ర కుమార్ యాదవ్, జిల్లా బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శికొయ్యగూర పెద్దన్న జిల్లా తెలుగు యువత కార్యదర్శి వడ్డే రామకృష్ణ, నియోజవర్గం బీసీ సెల్ కార్యదర్శి లోలూరు నారాయణస్వామి, జిల్లా ఎస్సీ సెల్ మీడియా కోఆర్డినేటర్ మొండి పోగులఎర్రిస్వామి దేగల హరీష్ రాచేపల్లి శ్రీనాథ్ హాజీ పీరా, భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామంలో జగనన్న ఇల్లు నిర్మాణ లబ్ధిదారులకు నీటి సమస్యను పరిష్కరించినట్లు గ్రామ సర్పంచ్ వీరాంజనేయులు, వైసిపి నాయకులు నాగప్ప తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జగనన్న లేఅవుట్ లో ఇల్లు నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులు నీటి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో బోరు మరియు మోటార్లను ఏర్పాటు చేసి నీటి సరఫరా చేసినట్లు వారు తెలిపారు.లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పిస్తామని ఇంటి నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని వారు తెలిపారు.

జగన్‌తో రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-గుడిబండ: మండల పరిధిలోని కరికెర గ్రామ పంచాయితీలో ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒక్కలిగా కార్పొరేషన్ చైర్ పర్సన్ నదిని రంగయ్య గౌడ్, జడ్పిటిసి భూతరాజు, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు డిఎల్ యంజరేగౌడ్, ఎంపిడిఓ రామారావు, ఈఓఆర్డి నాగరాజు నాయక్, మండల సచివాలయాల కన్వీనర్ శివకుమార్, సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్,పాల్గొని రాష్ట్రానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి..

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర మండలం వై.బి.హల్లి పంచాయతీలోని గల పత్తికుంట, బుద్దయ్యపాళ్యం, జిల్లరగుంట, కోనప్ప పాళ్యం, కోడిపల్లి, గ్రామాలలో ప్రజా ఆశీస్సులు కోరుతూ కాంగ్రెస్ పార్టీ ముందడుగు కార్యక్రమం మండల అధ్యక్షుడు మంజునాథ ఆధ్వర్యంలో నిర్వహించారు. మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో గ్రామానికి తాగునీటి సౌకర్యం రోడ్డు సౌకర్యం చాలా అధ్వానంగా మారిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇద్రహళ్లి. గ్రామానికి చెందిన మూడవ తరగతి విద్యార్థి శ్రవణ్ తమ పాఠశాలకు తాగునీటి సౌకర్యం లేదని తమ పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు ఆయన స్పందించి మడకశిర ఎంపీడీవో సోనీబాయ్‌కి చరవాణి ద్వారా సంప్రదించి రేపటిలోగా పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రభాకర్ రెడ్డి, మడకశిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంజునాథ్ రంగనాథప్ప, రంగధామప్ప, గోవింద నాయక్ సోమశేఖర్ రెడ్డి జాను నారాయణప్ప జిల్లాలగుంట నర్సగౌడ్, తిమ్మన్న భక్తులపల్లి రంగనాథ్ కొండప్ప దొడ్డయ్య సదాశివప్ప, కోడిపల్లి మోహన్,మడకశిర టౌన్ ప్రెసిడెంట్ బాబుప్రసాద్, గుడిబండ రామలింగప్ప పాల్గొన్నారు.

రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

విశాలాంధ్ర-కదిరి: ఆరుగాలాలు కష్టించి పనిచేసే రైతన్నల కోసం 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందజేస్తామని ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కదిరి రూరల్ పరిధిలోని ముత్యాలచెరువు వద్ద రూ.81.93 లక్షలతో నూతనంగా నిర్మించిన సబ్ స్టేషన్ ను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ అరుణ్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో రైతులకు ఉపయోగకరమైన సబ్‌స్టేషన్ ప్రారంభించడం ఆనంద దాయకం అన్నారు. తాలూకా పరిధిలో భూగర్భ జలాలు పెరిగి బావులలో, బోర్లలో నీటి సౌకర్యం పెరగడంతో కరెంటు వినియోగం పెరిగిందని పెరిగిన విద్యుత్ వినియోగానికి తగ్గట్టుగా నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ వంశీకృష్ణ, విద్యుత్ డి.ఈ మోషేస్, ఏడీ శ్రీనివాసులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.